## క్లుప్తంగా

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**ఉయ్యాలవాడ :** మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి వారికి భక్తులు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆర్యకులు కుమరేశ్వర, ఆనంతయ్య, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### 23 నుంచి శనగ కొనుగోళ్లు

**ఆళ్లగడ్డ:** ఈ నెల 23వ తేదీ నుంచి రబీలో సాగైన శనగలను కొనుగోలు చేస్తామని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి శనివారం తెలిపారు. ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు వెంటనే స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రూ.5,335తో కొనుగోలు చేయాలని ఆదేశించింది. 13వ తేదీ నుంచి రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

### బైకును ఢీ కొట్టిన కారు

**రుద్రవరం:** మండలంలోని హరినగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఆళ్లగడ్డ పట్టణం రామలక్ష్మి కొట్టాల కాలనీకి చెందిన ఫకీర్ బాషా శనివారం చేపల కోసం హరినగరానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో మలుపు తిరుగుతుండగా వెనుక వైపు నుంచి కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఫకీర్ బాషా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### పోస్టాఫీస్‌లో ఖాతాలు ఓపెన్ చేసుకోవాలి

**దొర్నిపాడు:** పీఎం కిసాన్‌కు అర్హత ఉండి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాని వారు వెంటనే స్థానిక పోస్టాఫీస్‌లో ఖాతాలను ఓపెన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో బ్యాంక్ ఖాతాలకు మొబైల్, ఆధార్ నంబర్లు అనుసంధానం కాని వారు 82 మంది ఉన్నారన్నారు. వీరందరికి 13వ తేదీ పోతగండ్ల ఉపకావాలంటే పోస్టాఫీస్‌లో ఐపీపీబీ ఖాతా ప్రారంభించాలని సూచించారు.

### రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**రుద్రవరం:** మండల కేంద్రం నుంచి ఆర్.కొత్తూరు వైపు ఉన్న ఆర్‌అండ్‌బీ తారు రోడ్డుకు శనివారం మరమ్మతులు చేపట్టారు. దాదాపు రూ.4.5 లక్షలతో పనులు చేపట్టినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వేసిన రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు దెబ్బతిని గుంతల మయమైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, పుల్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడంతో పనులు మొదలయ్యాయి. దా దాపు 2 కి.మీ. మేర దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి.

### దివ్యాంగులకు ఉచిత కంటి వైద్య శిబిరం

**నంద్యాల(వ్యవసాయం):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలకు రెండో రోజు పట్టణంలో విశేష స్పందన లభించినట్లు రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 9 వికలాంగ పాఠశాలల్లో దాదాపు 500 మందికి కంటి పరీక్షలు చేసినట్లు చెప్పారు. వెలుగోడు క్రాంతి వికలాంగుల పాఠశాల, పెద్ద కొట్టాలలోని భారతీ ఎడ్యుకేషన్ పాఠశాల, ఆళ్లగడ్డలోని బాలికల వసతి గృహం, నంద్యాల గ్రామీణనగర్‌లోని బ్లైండ్ స్కూల్, దామకాల్వ వద్ద ఉన్న ఉషామనోవికాస్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశామని పేర్కొన్నారు. కోఆర్డినేటర్ ప్రేమ్‌సాగర్, దేవయ్య, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు యాకూబ్, ఉస్మాన్‌బాషా, బాలుడు, మునీరుద్దీన్, హలీమా, విజయకాంత్ పాల్గొన్నారు.

### సేవాస్ఫూర్తి కార్యక్రమాలు విస్తరిస్తాం

**నంద్యాల(అర్బన్):** అఖిల భారత సేవాస్ఫూర్తి కార్యక్రమాలను నంద్యాల జిల్లాలో విస్తరిస్తామని సంఘం రాష్ట్ర కన్వీనర్ పూల వీరయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు స్వరూప్ దత్త అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరయ్య మాట్లాడుతూ నిరాశ్రయులు, నిర్భాగ్యులు, పేద విద్యార్థులు సంఘాన్ని ఆశ్రయిస్తే సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర అబ్జర్వర్ సోమన్న, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మునిస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

---

- హోటళ్లు, రెస్టారెంట్లలో కొరవడిన శుభ్రత
- నాణ్యత లేని, నిల్వ ఉంచిన పదార్థాలతో వంటలు
- విచ్చలవిడిగా టేస్టింగ్ సాల్ట్, రంగుల వాడకం
- ట్రేడ్ లైసెన్స్, ఫుడ్‌లైసెన్స్ లేకుండా నిర్వహణ
- రుచి కోసం రసాయనాల వినియోగం
- క్యాన్సర్ బారిన పడే ప్రమాదముందంటున్న నిపుణులు

# ఆహారం కల్తీ.. ఆరోగ్యం సుస్తీ

ఒకప్పుడు పూటకూళ్లుగా పిలవబడేవి.. ఇంటి భోజనం వండి వడ్డిస్తుండటంతో నాడు వాటికి గౌరవం కూడా ఉండేది. వాటి పరిణామ క్రమమే హోటళ్లు. ఏదైనా పరిణామ క్రమం ఉన్నతంగా ఉండాల్సింది పోయి.. అంతకంతకు దిగజారిపోతోంది. భోజనం నాణ్యతగా వండాల్సి ఉండగా.. కాసులకు కక్కుర్తి పడి ఏది పడితే అది, వాడకూడని వాటిని కలిపి వండి వడ్డించి భోజన ప్రియుల బొజ్జలను విషంతో నింపేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా, నిషేధిత పదార్థాలు వాడుతున్నా యంత్రాంగం నిమ్మకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.



☛ అది నంద్యాల పట్టణంలోని ఓ పేరుగాంచిన హోటల్. ఆయితే రుచికి, శుచికి పెట్టింది పేరూ ప్రచారం చేసుకుంటున్నారు. లోపలికెళ్లగానే వస్త్రధారణ, అలా వెళ్లండి, ఇక్కడ కూర్చోండి.. అంటూ స్వాగతం పలకడం, స్వయంగా వెళ్లి తెచ్చుకోవాలి, ముందుగా బిల్లు చెల్లించాలని పలు రకాల నిబంధనలు చెబుతారు. ఓ రోజు వినియోగదారుడు ఆవురావురుమంటూ తింటున్నాడు. ఇంతలో స్పూన్‌కు ఏదో వేలాడుతుండటం, తొక కనిపించడంతో నిశితంగా గమనించాడు.. ఇంకేముంది సాంబారులో బాగా ఉడికిన బల్లి దర్శనమిచ్చింది. ఇదే ఆ హోటల్ తీరు. బాధితుడి ఫిర్యాదుతో సంబంధిత అధికారులు జరిమానా విధించారు.



☛ నాన్ వెజ్ ప్రియులకు ఆ హోటల్ పేరుగాంచింది. అందులో రుచే వేరని, అక్కడ తినాలంటే కొంత సేపు నిరీక్షించాల్సిందేనని ముందుగానే వెళ్లి వేచి చూస్తుంటారు కూడా. అయితే ఇటీవల ఆహార భద్రత శాఖ అధికారుల దాడుల్లో పాచిపోయిన, వారం క్రితం నాటి మాంసాన్ని ఫ్రిజ్‌లో భద్రపరిచి ఉండటం, రుచి కోసం టేస్టింగ్ సాల్ట్, రసాయనాలు, రంగు కోసం నిషేధిత రసాయనాలు వాడుతుండటం, అపరిశుభ్ర వాతావరణాన్ని గుర్తించి బండారం బట్టబయలు చేసి కేసు నమోదు చేసి, జరిమానా విధించారు. ఇలా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆహారాన్ని కల్తీ చేసి వడ్డిస్తుండటంతో జనం రోగాల బారిన పడుతున్నారు.

**నంద్యాల(అర్బన్):** వేడివేడిగా ఏది వడ్డించినా కల్తీని కనిపెట్టలేరనే భావనతో కొందరు హోటళ్ల నిర్వాహకులు మోసం చేస్తున్నారు. బార్లు, రెస్టారెంట్లలో మద్యం మత్తులో మందు బాబులు ఏదైనా తింటారులే అనే ఆలోచనతో నాణ్యతలేని పదార్థాలను వడ్డిస్తున్నారు. వండుకోవడానికి ఇంట్లో వీలు కాక కొందరు, వారాంతంలో హోటళ్లు, రెస్టారెంట్లలో భోజనం చేయాలనుకునే వారు మరికొందరు, స్నేహితులు, ఆధికారులతో కలిసిన ప్పుడు మర్యాదపూర్వకంగా బయట భోజనం చేయాలనుకొని ఇంకొందరితో హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపారం నంద్యాల జిల్లాలో మూడు పదార్థాలు, ఆరు ప్లేట్లుగా సాగుతోంది. నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్, శ్రీశైలం, కోవెలకుంట్ల, పాణ్యం తదితర ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు దాదాపు 720 వరకు ఉన్నాయి. ఇవి కాక జాతీయ రహదారుల్లో దాదాపు 30కి పైగా దాబాలు ఏర్పాటయ్యాయి.

### రంగులు కలిపి..

రుచి కోసం అనుమతులు లేని రంగులను కలిపి ఆహార పదార్థాలను వండి వడ్డిస్తున్నారు. అలాగే అజినోమోటా (టేస్టింగ్ సాల్ట్)ను వాడుతున్నారు. అధిక శాతం ప్రజలు హోటళ్లు, రెస్టారెంట్ల రుచికి అలవాటుపడటానికి కారణం ఇది కూడా ఒకటి. అజినోమోటాతో క్యాన్సర్, ఎసిడిటీ దారి తీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నా దాని వాడకం ఆపడం లేదు. మరోవైపు ఎక్కువ శాతం హోటళ్లలో శుభ్రత కరువైంది. మిగిలిపోయిన పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి రెండు మూడురోజుల తర్వాత వాటిని వేడి చేసి వడ్డిస్తున్నారు. ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు నంద్యాలలోని పలు హోటళ్లలో దాడులు నిర్వహించగా నమ్మలేని నిజాలు వెలుగులోకి వచ్చాయి.

### తనిఖీలతో వాస్తవాలు వెలుగులోకి..

జిల్లాలో ఇటీవల స్థానిక అధికారులతో పాటు విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పలు హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. నంద్యాల, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, డోన్ తదితర ప్రాంతాల్లోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, చికెన్ పకోడా కేంద్రాల్లో తనిఖీ చేయగా.. దాదాపు అన్నింటిలో అపరిశుభ్రత నెలకొనడమే కాకుండా వంట పాత్రలు సరిగ్గా కడకపోవడం, మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మూడు రోజుల తర్వాత వేడి చేసి వడ్డించడం, ఆహారంలో సింథటిక్ కలర్స్ వాడటం వంటివి తనిఖీల్లో తేలాయి. నంద్యాల పట్టణంలోని కిచెన్ గార్డెన్‌లో కుళ్లిపోయిన చికెన్, మాంసాహారాన్ని పరిశీలించి హోటల్ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. అలాగే బైర్మల్ స్ట్రీట్, గాంధీచౌక్ ఏరియాల్లో దసిపోయిన కోళ్లతో తయారు చేసిన చికెన్ పకోడాను గుర్తించి జరిమానా విధించారు. ఇటీవల టూరిస్ట్ హోటల్ నిర్వాహకులు బల్లి పడిన ఇడ్లీ సాంబారును కస్టమర్లకు అందించడంతో పెద్ద దుమారం రేగింది. విషయాన్ని తెలుసుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారి

### హోటళ్లలో పాటించాల్సిన నిబంధనలు..

- నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- వంట చేసే వారు, సర్వర్లకు ఎలాంటి అంటువ్యాధులు, చర్మ వ్యాధులు ఉండరాదు.
- వంటశాలను రోజూ పరిశుభ్రంగా ఉంచాలి.
- ఉపయోగించిన ప్లేట్లు, గ్లాసులను మరుగుతున్న వేడి నీటిలో శుభ్రం చేయాలి.
- నూనెను మళ్లీ మళ్లీ వేడి చేసి ఉపయోగించరాదు.
- వినియోగదారుల టేబుళ్లపై ఈగలు చేరకుండా సోడియం, హైపోక్లోరైడ్ ద్రావణంతో శుభ్రం చేయాలి.

### నిర్లక్ష్యంగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు..

హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కేవలం సంఘటన జరిగినప్పుడు మాత్రమే ప్రత్యక్షమై హడావుడి చేసి ఆ తరువాత కనిపించని పరిస్థితి నెలకొందని మండిపడుతున్నారు. కల్తీ పదార్థాలు, విష పదార్థాలను వినియోగదారులకు అందించే హోటల్ నిర్వాహకులపై మామూలు జరిమానాలతో సరిపెడుతున్నారు. బల్లి పడిన పదార్థాలు, కుళ్లిపోయిన మాంసాహారాలను ల్యాబ్‌కు పంపిన రిపోర్టులను గోప్యంగా ఉంచడంపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నిబంధనలు పాటించని వారిపై చర్యలు

అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, అమ్మకం జరపడం శిక్షార్హం. ఆహార పదార్థాల తయారీలో శుభ్రత పాటించని నిర్వాహకులపై రూ.లక్ష వరకు అపరాధ రుసుము విధిస్తాం. లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారం నిర్వహించడం నేరం. నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. కల్తీ ఉందని తేలితే ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5లక్షలు జరిమానా విధించే అవకాశముంది.

– శేఖర్‌రెడ్డి, ఫుడ్‌సేఫ్టీ అధికారి, నంద్యాల జిల్లా

### నిషేధిత రంగులతో క్యాన్సర్



రుచికోసం అనుమతులు లేని రంగులను ఆహారంలో కలిపిన పదార్థాలను తింటే క్యాన్సర్, ఎసిడిటీ వస్తుంది. మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి రెండు మూడు రోజుల తర్వాత తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయి. వంట చేసే వారికి చర్మవ్యాధులు ఉండరాదు. హోటళ్లలో ఉపయోగించిన ప్లేట్లు, గ్లాసులు మరుగుతున్న వేడి నీటితో శుభ్రం చేయాలి. మరగిన నూనెను మళ్లీ వేడి చేస్తే విషంగా మారుతుంది. నిషేధిత అజినోమోట సాల్ట్‌తో అనారోగ్యాలు కలుగుతాయి. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి.

–డాక్టర్ రాకేష్ రెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణులు

---

## హమాలీల సమస్య పరిష్కారానికి కృషి

**నంద్యాల(అర్బన్):** స్థానిక సీడబ్ల్యూసీ గోడౌన్ హమాలీల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రెండేళ్లుగా సీడబ్ల్యూసీ గోడౌన్‌కు రావాల్సిన ఎఫ్‌సీఐ బియ్యం ప్రైవేటు గోడౌన్‌కు తరలి పోతుండటంతో ఉపాధి కోల్పోతున్నామంటూ 120 కుటుంబాలకు చెందిన హమాలీలు శనివారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీడీఎస్ బియ్యంతో పాటు ఇతర పంటల ధాన్యాలు గోడౌన్‌కు వచ్చేలా జిల్లా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని చెప్పారు. హమాలీలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

## మహానంది బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం





ఎమ్మెల్యే శిల్పా రవికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీని ఆహ్వానిస్తున్న దృశ్యం

**మహానంది:** క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు నంద్యాలకు వెళ్లి ప్రముఖులను ఆహ్వానించారు. ఎమ్మెల్యే శిల్పా రవితో పాటు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులకు ఆహ్వానపత్రికలు అందజేసినట్లు చెప్పారు.

**బొమ్మలసత్రం:** శ్రీ కామేశ్వరి సమేత మహానందీశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ మహేశ్వరరెడ్డి ఆహ్వానం పలికారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో వేదపండితులతో కలిసి సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల మహాక్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించేందుకు శ్రీశైల దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం నిత్య కళారాధన వేదిక వద్ద నంద్యాలకు చెందిన శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అలాగే పుష్కరిణి వద్ద శ్రీకాళహస్తికి చెందిన సుకన్య బృందం వారి భరతనాట్యం, తిరుపూరుకు చెందిన గోదా నరసింహారావు బృందం వారి భక్తిరంజని, శ్రీకాకుళంకు చెందిన భారతి రమేష్ వారి కరేరి భక్తులు అలరించాయి. శివదీక్షా శిబిరాల వద్ద హైదరాబాద్‌కు చెందిన క్రాంతి, బృందం కూచిపూడి నృత్యదర్శన, ప్రకాశం జిల్లా కు చెందిన ఎం.లక్ష్మిరెడ్డి, పట్టాభిరామ కళానాట్య మండలి వారి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర పౌరాణిక నాటకం, విజయవాడకు చెందిన శ్రీనివాస నాట్య మండలి శివలీలలు, మోహిని విజయం పౌరాణిక నాటకాలు అలరించాయి.

### నిప్పుల వాగుకు 1,100 క్యూసెక్కుల నీరు విడుదల

**పాములపాడు:** మండలంలోని కేసీ కెనాల్ 120వ కి.మీ. లాకీన్సెల నుంచి నిప్పుల వాగుకు శనివారం 1,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుంకేసుల నుంచి వెయ్యి క్యూసెక్కులు కేసీకి విడుదలవుతున్నాయని, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 750 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందన్నారు. కాగా లాకీన్సెల వద్దకు 1,500 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని చెప్పారు. అక్కడి నుంచి నిప్పులవాగుతో పాటు తూడిచెర్ల సబ్ కెనాల్‌కు 350 క్యూసెక్కులు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 40 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నట్లు వివరించారు.

### ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవం జరిపిస్తున్న దృశ్యం

**మహానంది:** గాజులపల్లెలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్ల గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. నల్లమలలో వెలసిన శ్రీ సర్వనరసింహస్వామి ఆలయంలో కొలువైన ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. లోక కల్యాణం కోసం నరసింహస్వామి మాలధారులు భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

## లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

**నంద్యాల(వ్యవసాయం):** లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 1,243 కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు, రెండవ అదనపు జిల్లా జడ్జి కిరణ్‌కుమార్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అర్బన, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో శాశ్వతమైన తీర్పు లభిస్తుందని, అప్పీలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని కోరారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు 200, మోటారు వెహికల్ కేసులు 53, ఇందులో లబ్ధిదారులకు రూ.1.71కోట్లు లబ్ధిపొందారని, సివిల్ కేసులు 17, ఎస్‌టీఎస్ 940 లబ్ధిదారులకు రూ.6.92లక్షలు, బ్యాంకు కేసులు 13 పరిష్కారమైనట్లు వివరించారు. లోక్‌అదాలత్ సభ్యులు రామచంద్రారెడ్డి, భాస్కర్, సీనియర్ న్యాయవాదులు రామగోపాల్ రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, దీపా, గోపీశంకర్, వివేకానందరెడ్డి, ముక్కెర కృష్ణారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

**లోక్ అదాలత్‌లో 242 కేసులు పరిష్కారం**

**ఆళ్లగడ్డ:** స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 242 కేసులు పరిష్కరించినట్లు ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాసంఘం అధ్యక్షుడు వాసు తెలిపారు. మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి కక్షిదారుల సమక్షంలో కేసులు పరిష్కరించామన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి మార్గమని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, జూనియర్ సివిల్ జడ్జి శైలజ, న్యాయవాదులు పాల్గొన్నారు.

### ఆటో బోల్తా.. 16 మందికి గాయాలు

**బొమ్మలసత్రం:** బండి ఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామ శివారులో శనివారం రాత్రి ఆటో బోల్తా పడి 16 మంది గాయపడ్డారు. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. నంద్యాల నుంచి వెలుగోడుకు వెలుతున్న ఆటోలో 11 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏ కోడూరు శివారులో ఆటో ముందు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి పక్కనే వెళ్తున్న బైక్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 11 మందితో పాటు బైక్‌పైనున్న ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఆటోలో ఉన్న శివమ్మ, బైక్‌పై ఉన్న లలిత (4) పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. బండిఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ‘అప్పర్ భద్ర’తో రైతులకు అన్యాయం

**నంద్యాల(అర్బన్):** కర్ణాటక ప్రభుత్వం చేపట్టే అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయే అవకాశముందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5,300 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 13 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్త ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, సిద్ధేశ్వరం ప్రాజెక్టులను సందర్శించనున్నామని చెప్పారు. స్థానిక కార్యాలయంలో శనివారం ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబాఫక్రుద్దీన్, సోమన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు చేస్తున్న ఈఓ

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం షష్టిని పురస్కరించుకొని ఈఓ ఎస్.లవన్న, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేపట్టారు. సుబ్రహ్మణ్యస్వామి వారికి పంచామృతాలు, వివిధ ఫల రసాలతో అభిషేకం చేశారు.

### పుట్లాలమ్మ క్షేత్రానికి విరాళం

**ఆళ్లగడ్డ:** ఆర్.కృష్ణాపురం సమీపంలో వెలసిన పుట్లాలమ్మ క్షేత్రంలో కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి వారికి దాతలు నగదుతో పాటు బంగారు ఆభరణాలు శనివారం విరాళంగా అందజేశారు. బెంగళూరుకు చెందిన వైకాపా రామకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు హర్షవర్ధన్, గోవర్ధన్ లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కు చెల్లింపులో భాగంగా వారు స్వామి వారికి రూ.1,21,300 విలువ జేసే నామాలు, మీసాలు, ఆమ్మవారికి ముక్కు పుడక, నామం గల బంగారు ఆభరణాలతోపాటు ఆలయాభివృద్ధి నిధికి రాజగోపురం పునర్నిర్మాణానికి రూ.75వేల నగదును క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, ఈఓ సాయిజయచంద్రారెడ్డికి అందజేశారు. వారు దాతలను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు గంగిరెడ్డి తిమ్మయ్య, రామిరెడ్డి, రంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, గోపిరెడ్డి పుల్లారెడ్డి ఉన్నారు.



చైర్మన్‌కు నగదును అందజేస్తున్న దాతలు

### రహదారి విస్తరణకు సహకరించాలి

**నంద్యాల(అర్బన్):** బొమ్మలసత్రం నుంచి నూనెపల్లె వరకు చేపడుతున్న రహదారి విస్తరణకు ప్రజలు సహకరించాలని నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. శనివారం బొగ్గులైన్ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా ఉన్న కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ సుజాతరెడ్డి, వీఆర్‌ఓలు స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ స్థానికులు తెలిపిన వివరాలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు అందజేస్తామని చెప్పారు.

### 18న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

**ఓర్వకల్లు:** మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 18వ తేదీన జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా దాతల సహకారంతో నిర్వహిస్తున్న పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన విజేత జట్లకు తొలి నాలుగు స్థానాలకు గాను వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 81427 47710, 93460 94529 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### 19 నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని పెట్నికోటలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుండమల్లేశ్వర స్వామి క్రీడా మైదానంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు పాలపళ్ల సైజు విభాగం పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన ఎద్ల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం గా 20వ తేదీన నిర్వహించే యుశీబగిరి విభాగం పోటీల్లో గెలుపొందిన ఎద్ల యజమానులకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందించనున్నట్లు వివరించారు.

### నల్లమలలో ట్రాఫిక్ జాం

**ఆత్మకూరు:** నల్లమల అటవీ పరిధిలోని కర్నూలు –గుంటూరు ప్రధాన రహదారిలోని రోళ్లపెంట ఘాట్‌లో లారీ బ్రేక్‌డౌన్ కావడంతో కొండ ఎక్కలేక నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో దాదాపు రెండు గంటల పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కర్నూలు నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ లారీ నల్లమల అరణ్యంలోని రోళ్లపెంట ఘాట్ వద్ద పైకి ఎక్కలేక అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలు శ్రీశైలం, విజయవాడ,ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి కర్నూలు వైపు వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. రెండు గంటల అనంతరం ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ ద్వారా లారీని పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



రోళ్లపెంట వద్ద నిలిచిపోయిన లారీ